

బోరవెల్లిలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

## గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

- **అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు**
- **రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం**

మానవ పాడు, జనవరి 15 : క్రీడల్లో గెలు పోటములను సమానంగా తీసుకోవాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు క్రీడాకారులకు సూచించారు. మంగళవారం మండలంలోని బోర వెల్లిలో లక్ష్మీచెన్న కేశవ స్వామి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే విజయుడు ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలని సూచించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 20 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శేషిరెడ్డితో పాటు నిర్వాహకులు, వివిధ జిల్లాల క్రీడాకారులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



భూత్పూర్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- **మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

భూత్పూర్, జనవరి 15 : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. బుధవారం ఆయన భూత్పూర్‌లోని సాధిక్ ఇంట్లో కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ముందుగా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు సత్తూర్ నారాయణగౌడ్, సత్యనారాయణ, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, మురళీధర్‌గౌడ్, సత్యనారాయణ, వెంకట్రాములు, ఆల శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సురేశ్, గడ్డం రాములు, బ్రహ్మయ్య, మల్లేశ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్‌కు భారీగా ఇన్‌ఫ్లో..

- **కేసీ కెనాల్ ఇండెంట్ 2.50 టీఎంసీలు తుంగభద్ర నదిలోకి విడుదల**
- **ఆర్డీఎస్, కెనాల్ ఇండెంట్ నీటి విడుదలతో ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ**
- **ఆర్డీఎస్, తుమ్మిళ్ల, సుంకేసులకు తీరనున్న నీటికష్టాలు**
- **మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ప్రోద్బలంతో కదిలిన ఏపీ అధికారులు**
- **సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు**

అయిజ, జనవరి 15 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వ క్రమేపీ పెరుగుతున్నది. ఆర్డీఎస్ ఇండెంట్‌తో పాటు కేసీ కెనాల్ ఇండెంట్ 2.50 టీఎంసీల నీటిని మంగళవారం టీబీ డ్యాం నుంచి తుంగభద్ర నదిలోకి విడుదల చేయడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ సంతరించుకున్నది. ఈ నెల 8నుంచి ఆర్డీఎస్ నీటి వాటా 1.04 టీఎంసీల నీళ్లు టీబీ డ్యాం నుంచి విడుదల చేసినా ఆనకట్టకు చేరడం ఆలస్యమైంది. ఇదే విషయమై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు తెలంగాణ జలవనరుల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావు, సీఈ కబీర్‌బాషా, ఎస్ఈ బాలచంద్రారెడ్డితోపాటు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిలు ఎప్పటికప్పుడు సంప్రదించి ఆర్డీఎస్ నీటితో పాటు ఏపీలోని కేసీ కెనాల్ ఇండెంట్‌ను జాయింట్‌గా విడుదల చేస్తే ఏపీలోని కేసీ కెనాల్ ఆయకట్టుతో పాటు తెలంగాణలోని ఆర్డీఎస్ ఆయకట్టుతో పాటు తుమ్మిళ్ల ఆయకట్టుకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. దీంతో మంగళవారం ఏపీలోకి కేసీ కెనాల్ ఇండెంట్ 2.50 టీఎంసీల నీటిని విడుదల చేయాలని టీబీ డ్యాం అధికారులను కోరారు. కర్ణాటకలోని గుండ్లకేరి నుంచి వెయ్యి క్యూసెక్కులు, టీబీ డ్యాం నుంచి వెయ్యి క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు నీళ్లు విడుదల కానున్నాయి. కేసీ కెనాల్, ఆర్డీఎస్ ఇండెంట్ నీటి విడుదలతో శుక్రవారం నాటికి ఆర్డీఎస్ ఆనకట్ట ఓవర్ ఫ్లో అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఆర్డీఎస్ ఆనకట్టకు 958 క్యూసెక్కులు ఉండగా, ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 598 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దిగువకు 123 క్యూసెక్కులు ఆర్డీఎస్ కన్‌స్ట్రక్షన్ స్లూయిస్ రంధ్రాల గుండా దిగువకు ప్రవహిస్తుంది. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.9 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆర్డీఎస్ ఆనకట్టలో నీటినిల్వ పెరిగితే ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు నీటి విడుదల పెంచుతామని ఆయన పేర్కొన్నారు. సుంకేసుల బ్యారేజీలో ఎఫ్ఆర్ఎల్ 292అడుగులకు పెరిగితే తుమ్మిళ్ల ఎత్తి పోతల పథకం ప్రారంభించి దిగువకు నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్టకు నీటి చేరిక భారీగా పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్ ఇండెంట్‌తో పాటు కేసీ కెనాల్ ఇండెంట్ నీటి విడుదలతో ఆర్డీఎస్ ఆయకట్టులో సాగు చేసిన పంటలకు సాగు నీరు పుష్కలంగా అందుతుందని భావిస్తున్నారు. మార్చి 20వరకు సాగు నీరు అందించి పంటల దిగుబడికి చర్యలు తీసుకోవాలని ఇరురాష్ట్రాల అధికారులను రైతులు కోరుతున్నారు.

**టీబీ డ్యాంలో ..**

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో నిలిచిపోగా, అవుట్‌ఫ్లో 11,314 క్యూసెక్కులు నమోదైంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 69.322 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1622.73 అడుగులు ఉన్నట్లు టీబీ బోర్డు సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.



కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టలో ప్రస్తుత నీటి నిల్వ

- **ఆక్రమణలకు గురవుతున్న రూ.కోట్ల విలువైన స్థలాలు**
- **మురుగు కాల్వలు సైతం కబ్జా**
- **గృహనిర్మాణాలకు అనుమతి తీసుకొని బహుళ అంతస్తుల నిర్మాణాలు**
- **పట్టించుకోని మున్సిపల్ అధికారులు**
- **భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవంటున్న ప్రజలు**



గద్వాలలో రామనందతీర్థ విగ్రహం ఎదుట కందకాన్ని కబ్జా చేసిన నిర్మిస్తున్న భవనం

# కబ్జాల పర్వం..!

గద్వాల మున్సిపాలిటీ పరిధిలో అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది.. ఎక్కడ చూసినా కబ్జాల పర్వం కొనసాగుతున్నది.. ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జాదారులు వాలిపోతున్నారు.. ఆఖరుకు మురుగు కాల్వలు సైతం వదలడం లేదంటే కబ్జా ఏ తీరుగా సాగుతుందో అర్థమవుతున్నది.. ఇక అక్రమ వెంచర్లకు హద్దే లేదని చెప్పాలి.. కబ్జాదారులకు ఇంత ధైర్యం ఎలా వచ్చిందని ఆలోచిస్తున్నారా.. ఇందులో ఆలోచించాల్సింది ఏముంది..? మనకు తెలిసేందే.. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరి.. రాజకీయ నాయకుల అండదండలు.. ఉన్నతాధికారుల పట్టింపులేని తనం.. వెరసి పట్టణంలో విలువైన స్థలాలు కబ్జాలపాలవుతున్నాయి.. ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ప్రమాదం తప్పదంటూ ప్రజలు బాహటంగానే చర్చించుకుంటున్నారు.

–గద్వాల టౌన్, జనవరి 15

గద్వాల మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు.. కబ్జాలకు.. నిబంధనలకు వ్యతిరేకంగా వెంచర్లు వేయడం.. గృహనిర్మాణ అనుమతులతో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అంతేలేకుండా పోతున్నది. వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రహరీకి ఆనుకొని ఉన్న 20 ఫీట్ల డ్రైనేజీని మున్సిపల్ ప్రమేయం లేకుండానే కూల్చివేశారు. పాత డ్రైనేజీ స్థానంలో కొత్త డ్రైనేజీని నిర్మించి ఇస్తామని నమ్మబలికి ఆ ముసుగులో 10 ఫీట్ల స్థలాన్ని కమీషన్ దారులు వారి ఖాతాలో వేసుకున్నారు. ఇండోర్ స్టేడియం, పాల కేంద్రం మధ్య ఉన్న దాదాపు అర ఎకర పొలాన్ని కబ్జా చేసేందుకు ఓ వర్గం యత్నించింది. ఇందుకు సంబంధిత అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపైకే దాడికి యత్నించారు. గాంధీచౌక్ నుంచి గంజిపేటకు వెళ్లే మార్గంలో ఉన్న కందకంపై ఎన్నో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఏకంగా కందకాన్ని పూడ్చివేసి నిర్మాణాలు చేపట్టారు. మరికొందరు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. అలాగే బాల స్వామి డబ్బా ముందు ఉన్న కందకం పూర్తిగా కనుమరుగైంది. కృష్ణారెడ్డి బంగ్లా దగ్గర, థియేటర్ల ముందు ఉన్న 30 ఫీట్ల కందకం మూడు ఫీట్లకు కుదించుకు పోయింది. రెండు లారీలు అటు ఇటు రాకపోకలు సాగించే వడ్డేవీధిలో ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. ఇలా చెప్పుకుంటే పోతే.. ఎన్నో అక్రమ నిర్మాణాలు, కబ్జాలతో పట్టణం రోజురోజుకు కుంచించుకు పోతున్నది.

**అక్రమ వెంచర్లు ఏర్పాటు..**

గద్వాల సమీపంలో అక్రమ వెంచర్లకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. రీక్రియేషన్ జోన్‌లో ఉన్న భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన చేయించుకొని వెంచర్లు వేశారు. మాస్టర్ ప్లాన్‌లో రీక్రియేషన్ జోన్ కింద రిజర్వు చేసిన భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్ల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అలాగే నిర్మాణాలు కొనసాగుతున్నాయి. రీక్రియేషన్ జోన్‌లో ఉన్న భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారం అధికారులకు లేదు. అయినా కొందరు అధికారులు కాసులకు కక్కుర్తిపడి అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఆ భూముల్లో రూ. కోట్లల్లో వ్యాపారాలు సాగినట్లు తెలిసింది. ఇవేవీ తెలియక కొనుగోలు దారులు పూర్తిగా మోసపోతున్నారు.

**ఇష్టానుసారంగా నిర్మాణాలు..**

పట్టణంలో కొందరు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న అధికారులు మాత్రం తమకెందుకులే మూడు నెలలు ఇక్కడ ఉండి మరో చోటుకు పోయేటోల్లం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణ సమయంలో గృహం కోసం దరఖాస్తు చేసుకొని అనుమతి వచ్చిన తరువాత షాపింగ్ కాంప్లెక్స్, ఫంక్షన్‌హాల్స్, మాల్స్ నిర్మిస్తున్నారు. కనీసం నిబంధనలు కూడా పాటించడం లేదు. కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదు.

**అధికారులు పర్యటించినా చర్యలు శూన్యం..**

భీంనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌తో పాటు కృష్ణవేణి చౌరస్తాలోని ఓ మాల్ నిర్మాణాలకు జారీ చేసిన ఓసీ సర్టిఫికెట్ జారీపై అభ్యంతరాలు చెబుతూ గత కమీషనర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే సుంకులమ్మ మెట్టులో నిర్మాణం చేస్తున్న కట్టడంపై ఏకంగా సీఎం ప్రజావాణిలో కొందరు ఫిర్యాదు చేశారు. గంజిపేటలో ఏర్పాటు చేసిన వెంచర్‌పై, జమ్మిచేడు దగ్గర ఉన్న ఓ లే అవుట్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా అనుమతులు ఇచ్చారని, అదే శివారులో చేపడుతున్న భవన నిర్మాణం పూర్తిగా నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు ప్రణాళిక విభాగం ఏడీ సత్యబాబు గత ఏడాది డిసెంబర్ 2న గద్వాల మున్సిపాలిటీని సందర్శించారు. ఫిర్యాదులు వచ్చిన వాటిని పరిశీలించి వెళ్లారు. అయినా ఇంతవరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తారా లేదా చూడాలి మరి. అయితే కబ్జాల విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్టు చేయడం లేదు.



పాల కేంద్రం పక్కన కబ్జా చేసేందుకు చదును చేసిన భూమి



గద్వాలలో మురుగు కాల్వపై అక్రమ నిర్మాణాలు

# సందళ్లే.. సందళ్లే..



అయిజ పట్టణంలో ముగ్గు వేస్తున్న మహిళలు

- **ఘనంగా సంక్రాంతి సంబురాలు**
- **ఇంటింటా ముగ్గులతో అలరించిన మహిళలు**
- **ఉత్సాహంగా కబడ్డీ, క్రికెట్ పోటీలు**
- **బంధుమిత్రులతో కళకళలాడిన గ్రామాలు**

సంక్రాంతి పర్వదిన వేడుకలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకొన్నారు. మంగళ, బుధవారాల్లో మకర, కనుమను వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటింటా వేసిన రంగవల్లులు ఎంతో ఆకట్టుకున్నాయి. ఆవు పేడతో గొబ్బెమ్మలు తయారు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పిండి వంటకాలతో విందు భోజనాలను ఆరగించారు. సాయంత్రం రైతులు ఆలయాల చుట్టూ ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ప్రదర్శనలు చేశారు. మరక సంక్రాంతి సందర్భంగా పలు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ముగ్గుల పోటీలు, కబడ్డీ, క్రికెట్, ట్రాక్టర్ రివర్స్‌గేర్, సందేపురాళ్లు తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మూడురోజులపాటు జరిగిన సంబురాలతో గ్రామాలు సందడిగా మారాయి.

–నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ, జనవరి 15

### రంగవల్లులతో గద్వాల చీర

గద్వాల, జనవరి 15 : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర చేనేత మహిళా కళాకారులు రంగవల్లులతో గద్వాల చేనేత చీర ముగ్గు వేయడం అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నది. గద్వాల చీరను గుర్తుపట్టే విధంగా కంచుకోట కొమ్మ, చిన్న కోటకొమ్మ, హంస బార్డర్ కలిగిన చీరను ముగ్గు రూపంలో వేసి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఇంటి ముందు కళాత్మకమైనా డిజైన్‌తో ముగ్గను తీర్చిదిద్దారు. ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన గద్వాల చీరలను అందరికీ గుర్తుండేలా ఇంటిముందు వేసుకొన్నారు. ముగ్గువేసిన వారిలో పద్మావతి, లక్ష్మి, జ్యోతి, మాధవితోపాటు పలువురు మహిళలు ఉన్నారు.



ముగ్గుతో మహిళలు వేసిన గద్వాల కోటకొమ్మ చీర మోడల్




వనపర్తిలో ఆరుగ్యారెంటీల అమలుపై వేసిన నిరసన ముగ్గు



వనపర్తిలో ముగ్గు వేస్తున్న మహిళలు, చిన్నారులు



పాలెంలో ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు తిప్పుతున్న రైతులు

## బీఆర్ఎస్ ఫ్లెక్సీని చించిన గుర్తు తెలియని వ్యక్తులు

- **పోలీసులకు ఫిర్యాదు చేసిన కన్మనూర్ బీఆర్ఎస్ నాయకులు**




కన్మనూర్‌లో బీఆర్ఎస్ ఫ్లెక్సీని చించిన గుర్తు తెలియని వ్యక్తులు

మరికల్, జనవరి 15 : నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని కన్మనూర్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. బుధవారం ఉదయం దీనిని గుర్తించిన బీఆర్ఎస్ నాయకులు రమేశ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాంచంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి మరికల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకొని ఫ్లెక్సీని పరిశీలించి ఫ్లెక్సీని చించిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### పోలీసుల మెరుపు దాడి

- **4 పందెం కోళ్లు, 5 బైకులు, నగదుతో పాటు 9 మంది అరెస్ట్**

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 15 : సంక్రాంతి సంబురాల్లో భాగంగా మండల పరిధిలోని పెద్దముద్దునూరులో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై నాగర్‌కర్నూల్ రెండో ఎస్సై జయప్రసాద్‌ఆధ్వర్యంలో పోలీసులు మెరుపు దాడి చేసి, కోళ్ల పందెం నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం నాగర్ కర్నూల్ మండలం పెద్దముద్దునూరు గ్రామ శివారులో సంక్రాంతి పండుగ సందర్భంగా కొందరు వ్యక్తులు కోడి పందాలు (బెట్టింగ్ )నిర్వహిస్తున్నారని తెలిసిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి స్థావరంపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో4 పందెం కోళ్లు, 5 బైకులు, రూ.17,580 నగదుతోపాటు 9 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## కారు, ఆటో ఢీ.. ఇద్దరు మృతి

కల్వకుర్తి రూరల్, జనవరి 15 : ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని తుర్కలపల్లిలో బుధవారం చోటు చేసుకున్నది. తోటపల్లి గ్రామానికి ఆటో ప్రయాణికులతో కల్వకుర్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా తుర్కలపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ మహేశ్(36), బంగారయ్య(38) అక్కడికక్కడే మృతి చెందగా శ్రీపతి, నాగమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు అటునుంచి మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు తరలించారు.

### కారు బోల్తాపడి యువకుడు మృతి

బాలానగర్, జనవరి 15 : కారుబోల్తాపడి యువకుడు మృతి చెందిన ఘటన బాలానగర్ మండలం చిన్నరేవల్లిలో మంగళవారం రాత్రి చోటు చేసుసుకున్నది. ఎస్సై తిరుపాజీ కథనం ప్రకారం నేలబండతండాకు చెందిన ఉదయ్ (24) మరో నలుగురు మిత్రులు కలిసి మంగళవారం సాయంత్రం మిత్రుడు మహేశ్ కారులో పెద్దరేవల్లి సమీపంలోని తిరుమల నాథుడి గుట్టపై జాతరకు వెళ్లారు. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో తిరిగి వస్తుండగా అప్పాజీపల్లి సమీపంలో వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన ఉదయ్‌ను షాద్‌నగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఉదయ్ మిత్రులకు స్వల్పగాయాలయ్యాయి. మృతుడు ఉదయ్ తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.